## క్లుప్తంగా

### ఘనంగా హనుమత్ వ్రతం



ఆంజనేయస్వామికి సింధూర పూజ చేస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్‌వ్రతం పూజలను విశేషంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి స్వామికి అభిషేకాలు జరిపారు. తదుపరి లక్ష తమలపాకుల పూజ, సింధూరపూజ, పట్టాభిషేక పారాయణాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న మండపంలో హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను చేసి, భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

### ఘనంగా బంగారమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



ప్రతిష్ట పూజ నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న ఈవో త్రినాథరావు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మ ఆలయ పునర్నిర్మాణం మరియు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. శైవాగమం ప్రకారం ఉత్సవాలను పండితులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉదయం యాగశాల ప్రవేశం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, ప్రధాన కుంభావాహన, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు సతీసమేతంగా ఈ పూజల్లో పాల్గొన్నారు.

### ముగిసిన తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుమంగై ఆళ్వారుకు, స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలకు విశేష పూజలు జరిపారు.

### ఉత్తమ రైతు శంకరరావు



పురస్కారాన్ని అందుకుంటున్న శంకరరావు

సబ్బవరం: వ్యవసాయంలో నూతన పద్ధతులు, యాంత్రీకరణతో మండలంలోని నారపాడుకు చెందిన మామిడి శంకరరావు ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. అనకాపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం 65వ కిసాన్ మేళా జరిగింది. పైడితల్లి మెమోరియల్ ప్రైజ్ పేరిట ఉత్తమ పురస్కారాన్ని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా శంకరరావు అందుకున్నారు. నూతన వంగడాలను తెప్పించి, ఆధునిక పద్ధతుల్లో సాగు చేయడం తనకు ఆసక్తి అని శంకరరావు తెలిపారు.



# సౌర వెలుగుల్లేపల్లి



- సోలార్ మోడల్ గ్రామంగా గుల్లేపల్లి
- పీఎం సూర్యఘర్ యోజనకు ఎంపిక
- శతశాతం సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటే లక్ష్యం
- చురుగ్గా రిజిస్ట్రేషన్ ప్రక్రియ

గుల్లేపల్లిలో మొత్తం గృహాలు **1,050**

యాప్‌లో నమోదు చేసుకున్నవి **517**

లిఖిత పూర్వక దరఖాస్తులు **57**

ఫీజిబిలిటీ సర్టిఫికెట్లు అందుకున్నవి **20**

సంప్రదాయ ఇంధన వనరులు నానాటికీ క్షీణిస్తున్నాయి. వీటితో కాలుష్యం కూడా ఎక్కువే. దీంతో పునరుత్పాదక(రెన్యువబుల్) ఇంధన వనరులపై కేంద్రం దృష్టి సారిస్తోంది. ఎన్నటికీ తరిగిపోని ఇంధన వనరు సౌరశక్తి. దీంతో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పేరిట సోలార్ రూఫ్ టాప్ యూనిట్ల ఏర్పాటును కేంద్రం ప్రోత్సాహం అందిస్తోంది. సబ్బవరంలోని గుల్లేపల్లి గ్రామం సోలార్ మోడల్ విలేజ్‌గా ఎంపికైంది. గ్రామంలో శతశాతం ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ యూనిట్ల ఏర్పాటే లక్ష్యంగా అధికారులు చర్యలు ప్రారంభించారు.



సోలార్ యూనిట్ ఫీజిబిలిటీ సర్టిఫికెట్లను అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



సోలార్ మోడల్ యూనిట్



ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పద్మజ, విద్యుత్ అధికారులు, గ్రామ పెద్దలు

సబ్బవరం: కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు రాయితీపై గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్‌లను అందిస్తోంది. పైలట్ ప్రాజెక్టులుగా ఎంపికైన గ్రామాల్లో పూర్తిస్థాయిలో సోలార్ యూనిట్లు ఏర్పాటైతే రూ.కోటి ప్రోత్సాహాన్ని కూడా అందించనుంది. దీంతో ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతోపాటు, ప్రోత్సాహక నిధులతో గ్రామాలు కూడా అభివృద్ధి బాటపట్టనున్నాయి. ఈ పైలట్ ప్రాజెక్టులో సబ్బవరంలోని గుల్లేపల్లి కూడా ఒకటి. ఇప్పటికే గ్రామంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని చైతన్యపరుస్తున్నారు.

**నెట్ మీటర్‌తో అదనపు ఆదాయం**

సోలార్ యూనిట్ ఉన్న ఇంటికి నెట్ మీటర్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మీటర్‌లో గ్రిడ్ నుంచి వినియోగదారుడు ఉపయోగించుకునే విద్యుత్ రీడింగ్‌తో పాటు, వినియోగదారుని సోలార్ యూనిట్ ద్వారా ఉత్పత్తి అయి గ్రిడ్‌కు వెళ్లే మిగులు విద్యుత్ రీడింగ్ కూడా చూపుతుంది. దీంతో గ్రిడ్‌కు వెళ్లే అదనపు విద్యుత్‌కు సంస్థ నిర్ణయించిన మొత్తం నేరుగా వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

**సోలార్ రూఫ్‌టాప్ రాయితీ**

| లోడ్ కిలోవాట్లలో | ఉత్పత్తి సామర్థ్యం యూనిట్లలో | వ్యయం రూ.లలో | రాయితీ రూ.లలో |
|---|---|---|---|
| 1 | 120 యూనిట్లు | 70 వేలు | 30 వేలు |
| 2 | 240 యూనిట్లు | 1.40 లక్షలు | 60 వేలు |
| 3 | 360 యూనిట్లు | 2.10 లక్షలు | 78 వేలు |

**సోలార్ రూఫ్ టాప్‌తో ఆదా**

| యూనిట్లు | ప్రస్తుత బిల్లు | 'సౌర'బిల్లు | ఏడాదికి ఆదా |
|---|---|---|---|
| 120 | రూ.1,000 | రూ.338 | రూ.7,944 |
| 240 | రూ.2,000 | రూ.333 | రూ.20,004 |
| 360 | రూ.3,000 | రూ.298 | రూ.32,424 |

**దరఖాస్తు చేసుకోండిలా..**

- పీఎం సూర్యఘర్ (https:// pmsuryaghar.gov.in/) పోర్టల్‌లో ముందుగా నమోదవ్వాలి. రాష్ట్రం, విద్యుత్ సరఫరా సంస్థ(ఈపీడీసీఎల్)ను సెలక్ట్ చేసి, విద్యుత్ కనెక్షన్(కన్స్యూమర్) నంబర్, మొబైల్ నంబర్, ఈ–మెయిల్‌ను ఎంటర్ చేయాలి.
- కన్స్యూమర్ నంబర్, మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ కోసం నమోదు చేసుకోవాలి.
- దీనిపై ఈపీడీసీఎల్ నుంచి అనుమతులు వచ్చాక, వారు అనుమతించిన కంపెనీల సోలార్ ప్లాంట్‌ను బిగించుకోవాలి.
- సోలార్ యూనిట్ ఏర్పాటయ్యాక, ఆ వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి, నెట్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- నెట్ మీటర్ బిగించాక ఈపీడీసీఎల్ అధికారులు తనిఖీలు చేసి, పోర్టల్ నుంచి కమిషనింగ్ సర్టిఫికెట్ ఇస్తారు.
- ఈ సర్టిఫికెట్ తర్వాత మీ బ్యాంకు ఖాతా వివరాలతోపాటు, ఓ క్యాన్సిల్డ్ చెక్‌ను పోర్టల్ నమోదు చేస్తే, 30 రోజుల్లో రాయితీ మొత్తం మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది.

**ఎవరికి ఎన్ని కిలోవాట్లు..**

| | | |
|---|---|---|
| నెలకు 150 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల యూనిట్ చాలు. | 150-300 యూనిట్ల మధ్య వినియోగించేవారికి 2-3 కిలోవాట్ల యూనిట్ అవసరం. | 300 యూనిట్లకు పైగా వినియోగించే వారైతే 3 ఆపై కిలోవాట్ల యూనిట్లను బిగించుకోవాలి. |

**బ్యాంకు రుణం అందిస్తామన్నారు**



మా ఇంటికి సోలార్ యూనిట్ ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. 3 కిలో వాట్స్ యూనిట్ బిగించాలంటే రూ.2.10 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఇందులో కేంద్రం రూ.78 వేలు రాయితీ కూడా ఇస్తుందన్నారు. మిగిలిన మొత్తాన్నే మేం చెల్లించాలని, అవసరమైతే బ్యాంకు రుణం కూడా ఇప్పిస్తామన్నారు. అదనపు సోలార్ విద్యుత్‌ను ఈపీడీసీఎల్ వారే తీసుకుని, డబ్బులిస్తామన్నారు.

– బండారు శ్రీనివాసరావు గుల్లేపల్లి

**కరెంట్ చార్జీల భారం తగ్గుతుంది**



సోలార్ మోడల్ విలేజ్‌గా ఎంపికయ్యాక మా గ్రామంలో అధికారులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అప్పుడే మేం కూడా 3 కిలోవాట్ సామర్థ్యమున్న సోలార్ యూనిట్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ఫీజిబిలిటీ సర్టిఫికెట్లు కూడా అందించారు. ప్రభుత్వ రాయితీతోపాటు, సోలార్ రూఫ్‌టాప్ యూనిట్‌కు 30-40 ఏళ్ల లైఫ్, ఐదేళ్ల వారంటీ ఉంటుందని ఈపీడీసీఎల్, యూనిట్ల ఉత్పత్తి సంస్థలు చెప్తున్నాయి. వీటితో కరెంట్ చార్జీలు బాగా ఆదా అవుతాయి.

– బోకం రామునాయుడు, గుల్లేపల్లి

**ప్రతి ఇంటికీ సోలార్ యూనిట్!**



ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. మా సిబ్బందితోపాటు, ఇతర విభాగాల అధికారులతో కలిసి గుల్లేపల్లిలో గ్రామ సభలు నిర్వహించాం. ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీ మినహాయించి, మిగిలిన మొత్తం వినియోగదారుడు చెల్లించాలి. ఆ మొత్తాన్ని కూడా ఎలాంటి ష్యూరిటీ లేకుండా 7 శాతం వడ్డీపై రుణంగా అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయి.

– ఎస్ రామకృష్ణ, ఈపీడీసీఎల్ డీఈ, కొంకోట సెక్షన్

## భూ కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు

- ఆక్రమణలపై తహసీల్దార్‌లు కఠినంగా వ్యవహరించాలి
- పెందుర్తి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పంచకర్ల
- పరవాడ, సబ్బవరంలోనూ సదస్సులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఎంతటివారైనా క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హెచ్చరించారు. భూ కబ్జాలను నిరోధించడానికి తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది అత్యంత కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి వార్డు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో మొత్తం 44 వినతులు వచ్చాయి. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, రెవెన్యూ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెపారు. మండలంలోని బంగారమ్మపాలెం, ఎ.సిరసపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సుల్లో పాల్గొని, రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. బంగారమ్మపాలెంలో 574.43 ఎకరాల భూమిలో 236.71 ఎకరాల ప్రభుత్వ భూమి, 337.72 ఎకరాల జిరాయితీ భూమి ఉన్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులో 7 అర్జీలు వచ్చాయన్నారు. ఎ.సిరసపల్లిలో ఉన్న మొత్తం భూమి 1,329.84 ఎకరాల్లో 877.21 ఎకరాల ప్రభుత్వ భూమి, 452.63 ఎకరాల జిరాయితీ ఉందన్నారు. గ్రామంలో పలు సమస్యలపై 7 వినతులు అందాయన్నారు. సదస్సులో సర్పంచ్ దాడి లావణ్య, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, దొడ్డి ప్రకాష్, వీఆర్వో నాగేశ్వరరావు, గ్రామ సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బంగారమ్మపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ



నాయుడుపాలెం సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేద్కర్

పరవాడ: రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు పెట్టుకున్న అర్జీలకు త్వరలో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేద్కర్ అన్నారు. నాయుడుపాలెంలో గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. పాస్ పుస్తకాలు, రీ సర్వే, సరిహద్దు సమస్యలపై రైతులు 104 అర్జీలు అందినట్లు తెలిపారు. సదస్సులో ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, సర్వేయర్ శ్రీనివాసరావు, ముత్యాలమ్మపాలెం ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, వీఆర్వో సీహెచ్ అప్పారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఆర్చరీ సంఘ ప్రతినిధులు

పరవాడ: జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి విలువిద్య పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారుర. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో మెరుగైన ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ నెల 23 నుంచి 25 వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్చరీ సంఘ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు.

**రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనది వీరే..**

ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో లలిత్ సాయి, మోహిత్ సాయి, నాభ్యప్రభాత్, పూర్వరాథోడ్, బాలికల విభాగంలో బి.వైష్ణవి, సాహితి, సాయి మనస్వి, హర్షితలు ఉన్నారు. కాంపౌండ్ విభాగంలో హర్ష, సాహిత్, వి.యశస్వి, వి.ఆద్యలు, రికర్వ్‌లో సాత్విక్, ఆరియానా, తన్మయి ఎంపిక కాగా స్టాండ్ బైగా అశోక్, తేజేశ్వర్, ప్రణీత్, కీర్తిలను ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్చరీ సంఘ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ వెల్లడించారు. రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా ఆర్చరీ సంఘ అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## ఆరు మాసాల్లో తాడి గ్రామం తరలింపు

- రక్షిత నీటి పథకం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పంచకర్ల



తాడిలో రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: తాడి గ్రామ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్న గ్రామ తరలింపును 6 నెలల వ్యవధిలో పూర్తి చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. గ్రామంలో రూ.9.95 లక్షల వ్యయంతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం, పైప్‌లైన్‌లను ఎమ్మెల్యే పంచకర్ల శుక్రవారం ప్రారంభించారు. గ్రామ తరలింపు సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. తాడి తరలింపు, ఉపాధి, పంచగ్రామాల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తాడి ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. పునరావాస కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి మోడల్ కాలనీగా తీర్చిదిద్దడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గ్రామాన్ని తరలించే విషయంపై జిల్లా అధికారులతో చర్చించడానికి గ్రామ పెద్దలను ఆహ్వానిస్తామని, వారం పది రోజుల్లో ప్రజలకు తీపి కబురు అందిస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, నాయకులు కోమటి సూరిబాబు, సుందరపు శ్రీనివాసరావు, కేఎస్‌ఆర్, గొల్లవిల్లి నాగరాజు, జి.అచ్చిబాబు, శ్రీనివాసరావు, పైల కృష్ణ, జి.కనకరాజు, దానబోయిన నీలకంఠరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న జాగృతి స్టాల్



మేళాలో వ్యవసాయ ఉత్పత్తులతో జాగృతి సభ్యులు

సబ్బవరం: అనకాపల్లిలో ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన 65వ కిసాన్ మేళాలో జాగృతి సంస్థ ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లు ఆకట్టుకున్నాయని సంస్థ ఎండీ కందర్ప సుజాత తెలిపారు. 7 రైతు ఉత్పత్తిదారుల పాలకవర్గ సభ్యులు, 90 మంది రైతులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత సాగులో సమస్యలపై శాస్త్రవేత్తల ద్వారా పరిష్కార మార్గాలను రైతులు తెలుసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జాగృతి అగ్రి కన్సల్టెంట్ వంటాకు రెడ్డినాయుడు, వ్యవసాయ విస్తరణాధికారి డాక్టర్ శ్రీమన్నారాయణ, సీహెచ్ ముకుందరావు, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయమా.. బారా!



ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ/వార్డు సచివాలయాలు ప్రజలకు అత్యంత మెరుగైన సేవలు అందిస్తున్నాయి. అయితే పెందుర్తి నడిబొడ్డున ఉన్న ఓ సచివాలయం మాత్రం మందుబాబులకు ఆవాసంగా మారింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న సచివాలయం పైభాగాన్ని ఆకతాయిలు బార్‌గా మార్చుకుని నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఆ బాటిళ్లను అక్కడే పగులగొట్టి పైశాచికత్వం ప్రదర్శిస్తున్నారు. మద్యపానంతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాలకు కూడా పాల్పడుతున్నారు. ఇదే ప్రాంగణంలో గ్రంథాలయం, ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ ఉన్నాయి. సచివాలయంపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

– పెందుర్తి







పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలోని వార్డు సచివాలయ భవనంపై తాగి వదిలేసిన మద్యం సీసాలు


## మట్టి రోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది



రావాడ-బొట్టవానిపాలెం గ్రామాల మధ్య మట్టిరోడ్డు

పరవాడ: మండలంలో రావాడ–బొట్టవానిపాలెం గ్రామాల మధ్య రహదారి సౌకర్యం అంతంత మాత్రంగానే ఉండడంతో ఇరు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండు గ్రామాల మధ్య సుమారు 2 కిలోమీటర్ల పొడవున ఉన్న మట్టి రోడ్డును అభివృద్ధి చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం కన్పించట్లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ చిన్నపాటి వర్షం పడినా మట్టి రోడ్డు బురదమయమై, వాహన రాకపోకలకు కష్టమవుతున్నట్లు చెప్తున్నారు. పండించిన పంటను ఇళ్లకు తెచ్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లి రాత్రి సమయంలో బస్సులు దిగి మట్టి రోడ్డు మీదుగా రావాలంటే విషపురుగులతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇరు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని రావాడ, బొట్టవానిపాలెం ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## 'కార్పొరేటర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి'



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

సబ్బవరం: సచివాలయ ఉద్యోగులపై జీవీఎంసీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కౌన్సిల్ సమావేశంలో చేసిన అనుచిత వాఖ్యలపై సచివాలయ ఉద్యోగులు మండిపడ్డారు. సబ్బవరం మండల పరిషత్ ఆవరణలో మండలానికి చెందిన సచివాలయ ఉద్యోగులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉన్నత విద్యార్హతలున్నా, ప్రభుత్వ ఉద్యోగం ద్వారా ప్రజలకు సేవ చేయగలమన్న మక్కువతోనే ఈ ఉద్యోగంలో చేరామన్నారు. విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు క్షేత్ర స్థాయిలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, కరోనా, వరదల వంటి విపత్కర సమయాల్లో తామందించిన సేవల్ని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు చేరువగా ఉంటూ, అన్ని విధాలా సేవలందిస్తున్న తమపై కౌన్సిల్లో సభ్యులు అమానుషంగా మాట్లాడటం సరికాదని, తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.